అదృష్టం

జగన్నథరావు, నన్నూ విశ్వపతినీ భోజనానికి పిలిచాడు, కూతురు పుట్టిన పండక్కి. ఆమహాతల్లి ఆయన అత్తగారు, ఆమె చేతులో ఏముందోగాని, ఆ వొక్క వాక్కాయి పచ్చడితోనే తిన్నాము——భోజనమంతా. ఇంటికి తీసుకుపోవాలి కొంచె మిమ్మంటే యేమనుకుంటుందో అనుకున్నాను. తాంబూలమై పైలుదేరపోతూవుంటే వాన వొచ్చింది. తమలపాకు పళ్లెం ముందు మళ్లీ కూచుని రెండోసారి ఆకుల్ని ధ్వంసం చెయ్యడం ప్రారంభించినాము.

"మీ అత్తగారిని మాకు అప్పిస్తావా, అమ్ముతావా, లేక పోతే రోజూ మమ్మల్ని భోజనానికి పిలుస్తావా? లేకపోతే దొంగతనం చెయ్యమన్నావా?"

"ఏమిటి"

"మీ అత్త నెత్తుకపోతాం"

"తను ఏ రుక్మిణితో, నువ్వు కృష్ణుడూ; తను రంభా, నువ్వు రావణుడూ—— అనుకొని——"

"అనుకుని——"

"ఇంక వదలనంటే——"

"విడో మారేజ్ వాళ్ళు కూడా వొప్పుకోర్రోయ్."

"నాయనా, తీసికెళ్ళండి. పచ్చడిరుచి చూసే మురిసిపడుతు న్నారు గాని, ఒక్కరోజు ఆమె సాధింపులూ అరుపులూ అనుభ వించారంటే ఇంక యేభూకంపాలు వొచ్చినా భయపడరు."

"ఆ భూకంపాలు కలిగినప్పుడు యింటోనుంచి బైటికిపోతే సరి."

"ఆ పచ్చడి కలుపుకుని, తినబోయ్యే స్థితిలో వున్నప్పుడే ఆరంభిస్తారోయ్ సాధింపులు! యీవాళ మీరుండబట్టి కాని!—"

"ఇల్లా బెదిరిస్తే భయపడి ఆమెను దొంగిలించడం మానస్తామనా?"

"అదృష్టవంతులకు యిట్లాంటి అత్తగార్లు దొరుకుతారు."

"పోనీ అత్తగార్లు అనకపోతే భార్యలే మంచివాళ్లు దొరకడం అదృష్ట మనకూడదూ?"

"డొక్కవంటతో సంతోష పడతామా, మరిభార్యలైతే"

"అట్లాచూసుకుంటే ఆసంతోషం భార్యవల్ల రాదు. అదృష్ట మంటే, డబ్బూ, పిల్లా, రొమాన్సు, అన్నీ కలసిరావాలి...... మనవిశ్వనాధునికి వచ్చినట్లు."

"అవేమిట్రోయ్, ఎప్పుడూవిన లేదే?"

"చిన్నప్పుళ్లే."

"చిన్నప్పుడే లే, ఇప్పుడునీకు రొమాన్సు వస్తుందంటే యెవ్వరు నమ్ముతారు కాని—"

నేను కలకత్తాలో యమ్. యస్. సి. చదువుతున్నప్పుడు జర్మన్ సర్కస్ ఒకటి వచ్చింది. లాడ్జివాళ్ళందరం చివరక్లాసుకు పొయ్యాం. చివరక్లాసు టిక్కెట్టే రెండురూపాయలయ్యేను.

సర్కసంతా సరే, పెద్దపులుల నాడించడానికి ఒకామె వచ్చింది. వొచ్చిన నిమిషంనుంచి ఆమె వెళ్ళిందాకా నేను ఎక్కడ వున్నానో మరచిపోయినాను—ఆమృగాలు ఏవో వేటి నాడించిందో తెలియదు. ఆమె కదలించడం, నడవడం, కళ్లతో బెదరించటం, ఇవే చూస్తాను. రక్తం రంగు మొహామల్ డ్రెస్సు వేసింది. నడుముకుమాత్రం ఆకుపచ్చ బెల్టు. దానిమీద ధగధగ

లాడే బాకు. ఇంతే, కాళ్లకు చేతులకీ ఏమి తొడగలేదు. ఆ చేతుల నునుపూ, తొడల మెరుపూ, కదిలినప్పుడల్లా అలలలా చలించే ఆకండా. ఆమె వెళ్లింది. గుర్రాలు క్లౌవున్లూ వొచ్చారు. కాని ఆమె కనబడుతోంది నాకళ్లకుమాత్రం. దోవపొడుగున అంటున్నారు ట్రాంలో.

"సింహంపిల్ల బలేమజాగావుంది."

"ఆ ఆడదాని సాహసంరా"

"నువ్వేమంటావు విశ్వపతీ"

నిద్రవస్తోందని కళ్లు మూసుకొని పడుకున్నాను. పిచ్చెత్తింది. ఎందుకో ఆ బాధ నిర్ణయించుకోలేను. ఈశ్వరదర్శనమైన వాడికి, యీలోకము సుఖాలు కష్టాలు ప్రజలూ వూళ్లుఅన్ని క్షణభంగురాలు, తృణప్రాయాలైనట్టే నాకు చదువూ హాస్టలూ స్నేహితులు యిల్లు ఇంటిదగ్గర బంధువులు సంసారము అన్ని మాయగా ఆశ్చర్యంగా కనపడ్డాయి. ఇంక వేరే ధ్యాసలేదు. పక్కమీదనుంచి లేవగానే ఆమె సంగతి ఆలోచించేవాణ్ణి. కాలేజీలో ఆమెనే అలా ఆలోచిస్తూ కలలు గంటాను. ఎప్పుడు సాయంత్రమౌతుందా ఎప్పుడు వెళ్లిచూద్దామా అనే ఆతురత. దగ్గరగా చూడాలని పెద్దటిక్కెట్టుకొన్నాను.

ఇంకా బాగా కనబడాలని యిరవైఅయిదు రూపాయలు పెట్టి—ఓపేరాగ్లాసు కొన్నాను. దాంతో మనదగ్గరవున్న సొమ్ము ఆఖరుఅయింది. ఎందుకు అట్లా బాధపడ్డానో, ఏమి లాభమనుకున్నానో, నేను యిప్పుడు చెప్పలేను. కాని ఆ వయసులో వున్నప్పుడు మన బాధ బలంచేతనే, మనము కోరే వస్తువుని సాధించగల మనిపిస్తుంది. పిల్లలు చంద్రుణ్ణి అందుకోగలుగుతామన్నట్టే మనము స్త్రీల నందుకో కలుగుతామనే విశ్వాసం మనని వద

లదు, నాలుగైదుసార్లు తల పగిలిందాకా.

చూచినకొద్దీ భ్రాంతి యెక్కువౌతోంది. రాత్రిళ్ళు జ్వరం కాచినట్టే, ఒకటే బాధతో దొల్లుతాను. ఆ పెద్దపులి పట్టుకుంటే ఆమెని! నేను దూకి పెద్దపులిని లాగేస్తే! సర్కస్ మానేజరు ఆమెని అక్రమం చెయ్యబోతుంటే! నేను వెళ్ళి అడ్డపడితే! ఇట్లా సినిమాలో చూచినట్టే! నా జీవితంలో జరిగినట్టే కథలు అల్లుకున్నాను. ఆ సర్కస్ వెళ్ళిపోతే నేను వెంటపోవాలి అని కూడా అనిపించింది.

ఒక సాయంత్రం డబ్బులేదు సర్కస్‌కి వెళ్ళాలంటే. అప్పు చేశాను. మర్నాడు టిఫిన్‌లు రెండుమానాను. నాకు కాలేజీలో వొచ్చిన ప్రైజ్ పెన్నిసల్ అమ్మాను. ఇంకా యింటినించి డబ్బు వారానికిగాని రాదు. మూడోరోజున అసలు డబ్బు పుట్టలేదు. డేరాదగ్గిరికి వెళ్ళాను. ఎవరన్నా పిలుస్తారేమోనని ఆశ. ఆట మొదలుపెట్టారు. చుట్టూ తిరుగుతున్నాను. మోటారాగింది. పక్కనే నుంచున్నాను. ఆమె దిగి లోపలికి వెళ్ళింది. వెంట యెవ్వడో వున్నాడు. విలువగల సూటులో—వొంటరిగా వాళ్ళిద్దరూ వొచ్చారు ఆమోటారులో. వాణ్ణి చంపాలనిపించింది. పాపం కుఱ్ఱదాన్ని చేసి వొంటరిగా మోటారులో పెట్టుకొస్తాడు! పాపమూ, పుణ్యమూ, లేవూ వీళ్ళకి. వెడుతూ నావంక చూచిందేమో ననిపించి వొణికి, కరిగి, దుమ్ముతో యేకమయినాను.

నేను బైటవున్నానే నేనన్నా దగ్గర లేకుంటే పెద్దపులి దగ్గరికి వెళ్ళిందే—ఏం అపాయం వొస్తుందో కదా! బైట వొణుకుతున్నాను భయంతో ఆతృతతో! వాడు మోటారులో పెట్టుకుచ్చాడే కాని, పెద్దపులినుంచి రక్షిస్తాడా!

గంటసేపట్లో మళ్ళీ వచ్చింది వాడితోనే. ఇద్దరూ మోటా

రెక్కుతున్నారు. వెన్నాకాలయెక్కిస్తే నేను! వాడేమన్నా చేస్తా డేమో దోవలో పాపమూ పిల్లని ?

"ఎవరిది?" అన్నాను పక్కనున్న వాడితో.

"ఓహో" అన్నాడు—వెళ్ళిపోతున్నాడు. జేబులో వెనక్కి వెళ్ళేందుకు ట్రాం టిక్కెటికే డబ్బుంది. వాడిచేతిలో పెట్టాను.

"జోసఫైన్—డాంటీ పులుల్ని ఆడిస్తుంది."

"ఇల్లెక్కడ?"

ఎడ్రెస్ చెప్పాడు.

"వాడెవడు ?"

"ఎవడో డబ్బిచ్చినవాడు"

"నేనిస్తే—"

"రేపు నువ్వు వస్తావు ఆమోటారులో."

గుండె చివుక్కుమంది.

దీనికోసమే నేను యిన్నిరోజులూ యీ బాధంతా పడ్డది! యీ నీచురాలికోసమా? ఒక్కదెబ్బతో నా మొహామంతా వాడిలిపోయింది. ట్రాంకి డబ్బులుకూడా లేవు. మూడుమైళ్ళు కాళ్ళీడ్చుకుంటూ పోయి పడుకున్నాను. కాని ఆమె నడకా, తళతళమనే జరీఅంచు బుజంమీదనుంచి జీరాడుతో రొమ్ము మీదికి జారటమూ, ముసుకునుంచి తప్పించుకొని చంపమీద వ్రాల్లే ఆజుట్టూ, ఆచిన్నజరీచెప్పులూ, ఆచిన్నకాలూ—నిద్ర రాదు—ఆమొగాడివంక చూసిన ఓరచూపు — చిరునవ్వూ. మూడురోజులు దాన్నే తిడుతున్నాను. కాని విష్ణుని హిరణ్యకశిపుడు ఎంతమరిచిపో గలిగాడో—రెక్కలుకాలాయని పురుగు దీపానికి ఎంతదూరము పోగలదో—నాగతీ అంతే అయింది.

డబ్బేకదా! డబ్బిస్తాను. ఇంటిదగ్గిరనించి డబ్బు వచ్చింది.

ఖర్చు తగ్గించుకుంటే పదిరూపాయిలు మిగిల్చుకోవచ్చు. దాంట్లో అయిదు దానికిచ్చినా, యింకో అయిదుతో రాత్రికేమన్నా కొన వచ్చు. ఇంకోరాత్రా? చాలదూ? కాని మచ్చికౌతాముగా. మెల్లిగా బెల్లించి నమ్మించి వూరికేనే వెళ్ళవచ్చు. పోనీ ఆ రెండో అయిదుకూడా యిచ్చేస్తే! మొగవాళ్ళ మనస్సు చాలా తమాషగా ఉంటుంది. ఆజోస్ఫైన్ అసలు సుశీలై మొగాడి వంకే చూడనిదైతే నాకు లభ్యమవుతుందా? కనుక మొగవా డంటే సరదా పడేదే ఐవుండాలి నాఉద్దేశ్యప్రకారం. కాని ప్రతి మొగాడివంకా చూసేది ఐవుండకూడదు. ఇంకోమొగాడివంక చూసిందా—చవకైపోయింది. ఆమెని నానాతిట్లు తిట్టుకుని అసహ్యపడ్డాను! మొగాడికి ఎట్లాఉంటుందంటే తానెటువంటి వాడైనా తనని మాత్రం వలిచేటంత రొమాన్సు మాత్రమే ఉండాలి స్త్రీకి. తాను కోరిన స్త్రీకి అప్పుడు ఆరొమాన్సుని గుడ్ టేస్ట్ అంటాడు. ఆమెని పతివ్రత అంటాడు "పాపం మనసు పట్టలేకపోయింది. ఇంకోత్తె ఐతేనా ఒక్క తన్నుతన్ని తనభర్తతో చెప్పేదే!" అనుకుంటాడు. తననిగాక యింకొకర్ని యిష్టపడ్డదా! కులట పాపాత్మురాలు! ఇట్లాంటివాళ్లు వుండబట్టే దేశమిట్లా పాడవుతోంది. వీళ్ళని కోసి కుక్కలకేసినా పాపమా! అంటాడు. ఆరోమాన్సు దోషమవుతుంది. ఆస్త్రీ దౌర్భాగ్యు రాలవుతుంది.

ప్రతి సాయంత్రము ఆమె యింటిచుట్టు ప్రదక్షిణాలు మొదలు—ఎప్పుడన్నా కిటికీలోనుంచి ఏమన్నా కనబడుతుం దేమోనని—ఎవడన్నా లోపలికి వెడతాడా, బైటికి వస్తాడా అని—ఒకరోజు మూడుకార్లు ఆగిఉన్నాయి ఆయింటిముందు. నిద్రపోయే 'ఛాఫర్ని' లేపాను.

"ఎవరికారు?"

"ఎందుకు?"

"ఊరికనే"

"హో"

అతని సలహా తీసుకొని అట్లాతిరిగి మళ్ళీ వచ్చాను.

"ఎక్కడికి వచ్చారు ఇగా కారు ఆయన?"

"అరే వెడ్తావా, తన్ననా?"

మళ్ళీ అతని సలహా నందుకున్నాను. సర్కస్ ఆప్పూరి నుంచి వెళ్ళిపోతుందే అని భయం పట్టుకుంది.

ప్రతి రాత్రీ ముందుసీటు పదిరూపాయలుపెట్టి రిజర్వుచేసి తీసుకొని ఆ అరగంట తనివితీర చూచి లేచివస్తాను. సర్కస్ మధ్యవచ్చి అరగంటలో లేచివచ్చే మానవుణ్ణి వింతగా చూస్తున్నారు. ఆమె తలవంచితే నేనూ వంచాను! నావంక కనుపడుతుం దేమోనని తేరిపారచూశాను. ఆమె పులిదగ్గర నుంచుంటే, ప్రాణశికి కళ్ళు మూసుకున్నాను. నుంచున్నాను. చప్పట్లు కొట్టాను. 'బ్రేవో' అని బిగ్గరగా అరిచాను. అంతవరకూ ఆ మోటారు వచ్చే దాకా బైటనుంచుని ఆమె లోపలికిరాగానే నా రిజర్వుడు సీటు లోకివచ్చి, ఆమె ఫీట్ కాగానే నేను బయటకు వెళ్ళి, ఆమె మోటారుప్రక్కన నుంచుంటాను.

ఒకరాత్రి ఒక్కతే వచ్చింది. ఆ ఎర్రటి జాకెట్ పైన మెరిసే కంఠాన్ని, జాకెట్ చిరుగుతుందేమో అనిపించే ఆమె 'బస్టు' ని చూచి తల్లడిల్లాను. ఫీట్ అయింది. నేను బయటికి వెళ్ళాను. ఇంక ఆమెతో మాట్లాడక, బతకలేనని నిరాశ నాకు మొండి ధైర్యాన్నిస్తోంది.

కిందికి చూస్తో, ఆలోచిస్తో వస్తోంది మోటారు దగ్గిరికి. ఆన

షక, అవ్రూపు, అగుండ్రనిచేతులు ఆ చంపల తెలుపు.

"నేనూ వస్తాను యీ రాత్రి", అన్నాను ఇంగ్లీషులో నా కంఠమే అది.

"ఎవరు ?" అంది.

"నీ ఎడ్మైరర్"

'ఛీ! పో' అన్నట్టు విదిల్చుకొని మోటారెక్కి తలుపుమీద చెయ్యిపెట్టింది.

అయిపోయింది నా సంగతి!

"వెళ్ళవద్దు. నేను చెప్పేదివిను. నిన్ను చూడక నేను బతక లేను. నన్నిట్లా వొదిలేస్తే నీమోటారు చక్రాలక్రిందపడి నలిగి పోతాను."

నా కంఠంలో ఎంతదీనత్వం పలికిందో నేనే ఆశ్చర్యపోయి నాను. నాబాధ వినబడ్డది గావును ఆమాటలోనే. మళ్ళీచూచి చిరునవ్వు నవ్వింది. తలవంచింది. పక్కన కూచున్నాను. కారు కదిలింది. మాటరాదు. ఆలోచనలేదు. నాలుగునిమిషాలు నా అదృష్టంతో దిగ్భ్రమచెంది కదలలేక పోయాను. చెయ్యిజాచి ఆమె చెయ్యిని తాకాను. చెయ్యిలాక్కొని అవతలగా కూచుంది. తొరతొరగా ఆలోచిస్తున్నాను. మరి ఎందుకు ఎక్కమంది? వూరికే కూచుంటే యేమనుకుంటుంది? వాళ్ళపద్ధతులేమిటో? ఏంమాట్లాడాలో? ఏం చెయ్యాలో? మొదలెట్లానో? శుద్ధ మూర్ఖుడు అప్రయోజకుడని, యింటికి పొమ్మంటుందేమో వూరికే కూచుంటే? చప్పున జరిగి ఆమెచుట్టూ చెయ్యివేశాను. ఒక్కతోపుతోసింది. రెండోమూల సీటుకింద దబేలుమని పడ్డాను. మోటారాగుతోంది. "హారీ! ఏమిలేదు పోనీ" అంది. "నాతో గాడిదలాగా ప్రవర్తించకు" అంది. పెద్దపులులతో

కు స్త్రీలుపట్టిన జెబ్బలవి—నా నడుము విరిగింది. మెల్లిగా లేచి పైనకూర్చున్నాను సిగ్గులేక. ఇంకమళ్ళీకదలలేదు. మోటా రాగింది. దిగి లోపలికి రమ్మంది నన్ను. మెల్లిగా చీకట్లో మెట్లుఎక్కాను. స్విచ్చినొక్కి గదిలో సోఫామీద కూర్చోమని లోపలికి వెళ్లింది. మళ్లావచ్చి ఎదురుగా కూర్చొంది. బట్లరు బుడ్డీ గ్లాసులు ముందు పెట్టాడు. నన్నొకగ్లాసులోది తాగమంది. ఎన్నడూ ఎరగను. కాని వొద్దంటే ఆకిటికీల్లోనుంచి కిందికి తోస్తే—సమిటా అది—వైనుబ్రాంది అని పేర్లు వినడమే— నోట్లో పెట్టాను. బాగుంది.

"ఏమంటావు ?"

"నీవు కావాలి."

"డబ్బు ?"

"ఇస్తాను."

"తీసుకొచ్చావా ?"

"లేదు."

"రేపు తీసుకురా."

"సరే."

"గుడ్ నైట్."

"ఎక్కడ కనబడతావు ?"

"అక్కడే"—స్విచ్ నొక్కింది—డ్రయివరు వచ్చాడు.

"హరీ, యీాన్ని ఇంటిదగ్గర దింపిరా."

లేచాను—హరీ దూరంకాగానే—

"ఎంతో తెలుసా?" అంది మృదువుగా చిరునవ్వుతో—

"ఎంత?"

"మూడువందలు."

మూడువందలు ! హాస్యమనుకున్నాను.

"ఏం ?"

"ఒక్క రాత్రికి మూడువందలు రూపాయలు !"

"హార్"

"మేన్"

"నాకు నిద్రవొస్తోంది. ఆయన్ని బైటికి వెళ్ళమని తలుపులు వేసెయ్యి"

నేను బైటికి వెళ్ళాను. మోటారుకోసం చూశాను. మోటారు లేదు. హారీ లేడు. దేవుడాఅని నడచి పొయ్యాను. మూడువందలు ! యేం చెయ్యను ?

ఇంకబుద్ధికలిగి ఆప్రస్తావన మానుకుంటే మంచిది. ఐదు రూపాయ లనుకున్నాను. మూడురోజులు ఆవేపు పోలేదు. కాని పగలు తోచదు. రాత్రులు నిద్రరాదు. ఏమీ చదవలేను. అసలు కనపడకుండా వెళ్ళిపోతుందేమోనని భయం. ఒకవేళ వేళాకోళానికి అన్నదేమో ? మళ్ళా యింకోకసారి మోటారు కేసి వేడితే—ఏమి యివ్వనక్కరలేదని ... నవ్వితే! ... ... ఊరికే అందిగాని ఎవడన్నా మూడువందలిస్తాడా ? కాక ... ... వెర్రి మొహాన్ని నన్నుచూసి ఒకసారి డబ్బులాగాలని ఎత్తువేశిందా? నేనిస్తానసే ?

మళ్ళీ 'సర్కస్‌కి' వెళ్లాను. ఆరాత్రిస్నేహితుడి చేతిలో పావలాపెట్టి ఆమెకి జీతం నెలకి నాలుగువందల యేభైయని తెలుసుకున్నాను.

మరి ఒక రాత్రికి మూడువందలా ?

"మరి ఆరాత్రి రాలా—అట్లాంటి వాళ్ళెంత యిస్తారు ?"

"వాళ్ళా, యింతఅనిఏమిటి ? నగలు బట్టలు ... అన్నీ."

"డబ్బు ?"

"మూడువందలు రాత్రికి."

మళ్ళీ సర్కస్ చూశాను. ఆమె నాకు దక్కదనుకున్న తర వాత ఆమెమీద కోపం ఎక్కువౌతోంది. ఆ పెద్దపులి తినెయ్యరాదూ; గొంతు చించెయ్యరాదూ...... ఎవరికీ కాకుండా.

హృదయంలో మండే అంత ద్వేషమూ, ప్రతి నిముషమూ చల్లబడి నీరై ఆమెపాదాల్ని తడుపుతోంది. పరీక్షమానుకు యింటికి పోదామనిపించింది. వెళ్ళి...... పరీక్ష ఐనాక మాత్రం వెళ్ళి !—ఏముంది ? తిండీ భార్యా పిల్లలూ సంపాదనా. మళ్ళీ యిట్లాంటి బాధ జీవితములో రుచిచూస్తానా ? మావూళ్లో యిట్లాంటిచర్యలు సాగించానా—చెప్పుతీసుకు కొడతారు కలకత్తా గనక సరిపోయింది గాని—డబ్బుకై తేనేంగాని—గంధర్వకన్య వంటిది నా మొహాన్ని చూసి నాలుగు గజాల దూరానికి రానిస్తుందా ? జన్మానికల్లా ఒక అదృష్టం కలిగింది. ఎంతడబ్బు పోసినా మళ్ళీ చూస్తానా ? అనుభవిస్తానా ?

పరీక్ష కిస్తుకనీ, నెలరోజులూ ఖర్చుకనీ, మావాళ్ళుపంపిన రెండువందలూ, వీడిదగ్గిరా వాడిదగ్గిరా గోకి వందా, మూడు వందలు జేబులో పెట్టుకొని...... మోటారు పక్కన నుంచు న్నాను.

"సరేనా ?"

తలవూపాను.

మోటారులో ఆమె చిన్న నడుంమీద నా చెయ్యేశాను. తలని నా బుజాన ఆనించింది, నిన్నటి పిల్లేనా ? ధనదేవతా, నిన్ను తప్ప ఇంకొకర్ని పూజించే మానవులంత మూర్ఖులుంటారా యీ ప్రపంచంలో ? ఒక్క మంత్రంతో అంత లావణ్యాన్ని

నా చేతికింద యిమిడ్చావు! అంతగర్వాన్ని నా కాలికింద పరిచావు! కలలోనైనా మెరగని ప్రేమని నాకు రుచిచూపావు అనుకున్నాను.

దీపాలు వరసగా ఒక్కొక్కటే ఒక నిమిషం ఆమె మొహాన్ని వెలిగిస్తున్నాయి. ఆ చిరునవ్వు, కళ్ళు పైకెత్తి నా మొహంవంక చూపు—ఎన్ని తపస్సులు చేస్తే దొరుకుతుంది మళ్ళీ, ఆ అనుభవం? యీనాడు నేను సంపాయించిన అరవై యెకరాల మాగాణీ నిజంగా—యిన్నేళ్ళు ప్లీడరీచేసి సంపాయించిందంతా మళ్లీ ధారపోస్తాననుకో—అట్లాంటి రాత్రికోసం. దగ్గిరగా యింకా దగ్గిరగా జరిగింది. మోటారాగితే ఆ స్వప్నం ఆఖరేమో! పోమ్మంటుందేమో! యీ మోటారు ప్రయాణానికి మాత్రమే నేమో... మూడు వందలూనా—ఇంటిదగ్గిర యెవడన్నా కాచుకొని వుంటాడేమో—ఈ డ్రైవరేం తగాదా పెడతాడో—అన్నభయాలే. దిగి మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళాము. మళ్ళీ వైను తాగించింది. తాను తాగి నాకిచ్చింది. నేను తాగింది తాను తాగింది. ఆ బట్టలుతీసేసి సన్నని గౌను వేసుకుంది. ఆ వొళ్ళంతా పిలుస్తోంది నన్ను. ఒక్క నిమిషం బల్లదగ్గిర ఆగి అమాంతం నా వొళ్ళో దూకికూచుంది. నా మెడచుట్టూ చెమట. ఆ పరిమళం—ఎక్కడనించో కొంచెంగా గాలిమీదా నీళ్ళమీదా తేలుతో వచ్చి ఎక్కడా... ఇదివరకు చూచామా... ఇది అనిపించి బాధ పెట్టదూ అట్లా. ఆ జుట్టు ఒక సువాసన—ఆమె నోరు వైను పరిమళము, ఆమె వొళ్ళు—మెడ ఎంత అందవికారండైనా, ఆ సువాసనలు వొదలలేక కావిలించుకుంటూను... ఆమె వొంటిమీద చిర్రుచెమటలే లవండరా అనిపించింది.

"రా లోపలికి" అంది.

డబ్బుసంగతి ఏమీ లేదు.

నేనే తీసి "ఇంద" అన్నాను.

కళ్ళు సగం మూతలుగా నిర్లక్ష్యంగా చూస్తో "తరవాత చూద్దాం" అంది.

ఎంత రాత్రి అయిందో తెలీదు. కొండల్లో అర్ధచంద్రుడు కుంకేప్పుడు నీళ్ళమీద ఎట్లాంటి వెన్నెల పడుతుందో అట్లాంటి కాంతివొస్తోంది, ఆ తగ్గించిన ఎలక్ట్రిక్ దీపంలోంచి, అలిసిపోయి పొగరంతాపోయి నా చేతులమధ్య పడుకుని నాకేసి చూస్తోంది.

"ఇంకా నిద్ర పోనియ్యవు ?" అంది నాచంపలు రాస్తో.

"ఎన్ని గంటలు ?" దిండుకిందచెయ్యి పెట్టింది. నాలుగు గంటలు మ్రోగాయి.

"మరియోసారి మోటారులో నెడతావా ?" అన్నాను నవ్వుతో.

ఒక్కతోపుతోసి నన్ను పడవేసి నారొమ్ముమీద తన రొమ్ముని అదిమింది.

ఆమె నిద్రపోతోంది. నాకు నిద్రరాలేదు. మూడువందల రూపాయలు ? కాని మళ్ళీ జన్మానికి అట్లాంటి రాత్రి వొస్తుందా ?

ఒకటే రాత్రి ! ఎట్లా కళ్ళుమూసి వృథాచెయ్యను నిద్రపోతో, మెల్లిగా లేచి ముఖం నాముఖం దగ్గిరకి తెచ్చి "నువ్వెవరు"అని పడుకుంది.

ఆప్రశ్నకేమోగాని "నేను ఆంధ్రుణ్ని" అని గర్వంగా జవాబు చెప్పాను. మరి తమకీర్తినంత వృద్ధిచేసినందుకు నాకే మిస్తారో యేమిటో ఆంధ్రులు ?

అలవాటు ప్రకారం ఆరింటికేమెళుకువ వొచ్చింది. లేదా

మంచె నాచుట్టూ చేతులువేసి పడుకొనివుంది. కదిలాను. ఆమె కళ్ళు తెరిచి చిరునవ్వునవ్వి "రా" అని దగ్గిరికి లాక్కుని నిద్ర పోయింది. నేనూ నిద్రపోయినాను. లేచేటప్పటికి పదైవుం టుంది. వేడినీళ్లు చన్నీళ్లు అన్నీ సిద్ధంగా వున్నాయి స్నానానికి. ఆయింటి యజమానుడివలె నా మాటను శిరసావహించి అతి భక్తితో మెలిగారు నౌకర్లు.

రొట్టె, టీ, వెన్న, మాంసము అన్ని వున్నాయి బల్లమీద. కష్టంమీద కొంచెం రొట్టె తిని టీ తాగాను. నేను మాంసం తినకపోవడం అతి చిత్రంగా చూసింది.

"మరి—రాత్రి—అదిపనికివొస్తుందా మీకులంలో ?"

ఏం జవాబుచెప్పను ? "హిందువుల్లో అంతే" అన్నాను. నాకులాన్ని తలచుకుని సిగ్గుపడుతో లేచాను.

"వెళతావా ?"

"గుడ్‌బై—" దగ్గిరికి వొచ్చి ముద్దుపెట్టుకుంది.

"మళ్ళా" అంది.

"మళ్లీనా ?"

"బాగుండలేదా ?"

నాకళ్లు జవాబు చెప్పాయి.

"మరిరాత్రి రాకూడదూ ?"

అమ్మా ! ఆశ—నేనుమాట్లాడలేదు.

ఏమనుకుంటోంది? నేను లక్షాధికారినా ? నేటివ్ ప్రిన్సునా? కాని బికారినని ఎట్లా వొప్పుకోను ? రాత్రంతా రాజాధి రాజువలె నటించి రానని తల వూగించాను.

"ఎందుకు !" అని కండ్లు కిందికి వాల్చింది. వింతనటన? నాకు కోపం వొచ్చింది.

"నేను ఎవరనుకున్నావు ? రాక్షిల్లరా ?" నవ్వింది.

"రా, నాదగ్గిర మూడువందల రూపాయలు కాదు ఒక్క——"

"ఏమీ యివ్వవద్దు రా."

"నిజమా, నిజమా ? వొస్తాను. మహారాజులాగ వస్తాను" అని వెళ్ళిపోయినాను.

ఈ అదృష్టం నిజమా ? నిజమా ? కలా ? సర్కస్ ఆవూరి నించి వెళ్ళిందాకా ప్రతిరాత్రీ వెళ్ళాను. స్నానం భోజనం అంతా అక్కడే. పరిక్షా ? అడుగుతున్నావా ? పరీక్ష ఏమయింది ? రామేశ్వరంలో పూజలు సరిగా జరుగుతున్నాయా ? భూమి సూర్యుడుచుట్టూ తిరుగుతోందా ? మానేసిందా ? ఈ కుంటి ప్రశ్నలు నాకెందుకు ?

చుక్క

(నార్వేజియన్ నావెల్ నించి)

౧

అమరావతి యింకామూడుమైళ్లుంది. వొడ్డున వరసగా చేలూ, అక్కడక్కడ చెట్ల గుబుర్లూ తప్ప యింకేమిలేవు. చక్కని గాలి వుండడంవల్ల ఆ వుదయం పడవ నీళ్లమీద తేలి పోతోంది. యెండ తెరచాపమీద యిటూఅటూ ఆడుతోంది. గట్టుదగ్గిరగా పడవ నడుస్తోంది. ఒకదిబ్బ మలుపు తిరిగాము.